సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 21 । ఆగస్టు । 2024



విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి సూచించారు. 8లో



అర్థమయ్యే రీతిలో బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. 8లో



పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోచన్ బేర సూచించారు. 8లో

ప్రాణాలు పోతేనేగాని
కళ్లు తెరవరా?

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు వసతి గృహాలను అధికార యంత్రాంగం సీజ్ చేసింది. మంగళవారం చింతపల్లిలో లెని చిల్డ్రన్‌హోమ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. 13 ఏళ్లుగా ఎటువంటి అనుమతులు, సౌకర్యాలు లేకుండా రేకులషెడ్లలో నిర్వహిస్తున్నా అధికార యంత్రాంగం దృష్టికి రాలేదు. అనకాపల్లి జిల్లాలో ఓ మిషనరీ సంస్థ వసతి గృహంలో కలుషిత ఆహారం వల్ల ముగ్గురు పిల్లలు చనిపోయి, అనేక మంది అతిసారం బారిన పడేవరకు వారు కళ్లు తెరవకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అనధికారికంగా 13 ఏళ్లుగా నిర్వహిస్తున్న లెని చిల్డ్రన్ హోమ్ సీజ్
- కాశీపట్నంలో హోలీ స్పిరిట్ మిషనరీ వసతి గృహంపై కూడా చర్యలు



చింతపల్లిలో లెని చిల్డ్రన్ హోమ్‌కు తాళం వేస్తున్న అధికారులు

చింతపల్లి: మండల కేంద్రమైన చింతపల్లిలో జెడ్పీ అతిథి గృహం ఎదురుగా 13 ఏళ్లుగా అనధికారికంగా నిర్వహిస్తున్న లెనీ చిల్డ్రన్ హోమ్‌ను మంగళవారం మండల అధికారుల కమిటీ సీజ్ చేసింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ క్రైస్తవ మిషనరీ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా మిగతా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం తనిఖీలు చేపట్టింది. దీనిలో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులతో ఏర్పాటైన మండల కమిటీ లెని చిల్డ్రన్ హోమ్‌ను తనిఖీ చేసింది. ఒకటి నుంచి డిగ్రీ వరకు చదివే 23 మంది విద్యార్థులను కనీస సౌకర్యాలు కల్పించకుండా ఒకేచోట ఉంచడాన్ని కమిటీ సభ్యులు గుర్తించారు. సంస్థ నిర్వహణకు సంబంధించి ఎటువంటి రికార్డులను నిర్వాహకురాలు సునీత చూపించకపోవడంతో అనధికారికంగా నిర్వహిస్తున్నట్టు వారు నిర్ధారించారు. విద్యార్థులకు అందించే మెనూ వివరాలు కూడా అందుబాటులో లేవు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిపోవడంతో వారిని ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. దీంతో లెని చిల్డ్రన్ హోమ్‌ను తహసీల్దార్ రామకృష్ణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఆర్ఐ కృష్ణమూర్తి సీజ్ చేశారు. ఇలావుండగా లెని చిల్డ్రన్ హోమ్‌లో ఒకటి నుంచి ఐదు వరకు ఎనిమిది మంది, 6నుంచి పది వరకు తొమ్మిది మంది, ఇంటర్,డిగ్రీ చదివే మరో ఆరుగురు ఉన్నారు. వీరిలో పది మంది బాలికలు, 13 మంది బాలురు ఉన్నారు. చిల్డ్రన్ హోమ్‌ను సీజ్ చేసిన నేపథ్యంలో వారి చదువుకు ఎలాంటి అవరోధం కలగరాదన్న భావనతో సంబంధిత ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించినట్టు మండల కమిటీ తెలిపింది.

అనుమతులు లేకపోవడంతో

సాక్షి,పాడేరు: అనంతగిరి మండలం కాశీపట్నంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోలీ స్పిరిట్ మిషనరీ వసతి గృహాన్ని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సీజ్ చేశారు. మంగళవారం తనిఖీ చేసిన ఆయన నిర్వాహకులను విచారించారు. గిరిజన విద్యార్థులతో మాట్లాడారు. వారు చదువుతున్న పాఠశాలల వివరాలతో పాటు వారి స్వగ్రామాలు, తల్లిదండ్రుల సమగ్ర సమాచారాన్ని ఆయన తెలుసుకున్నారు. వసతిగృహం నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన పీవో ఇక్కడ చదువుకుంటున్న 37 మంది గిరిజన విద్యార్థులను సమీప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు తాత్కాలికంగా తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్టళ్ల వివరాలను తమకు వెంటనే తెలియజేయాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లను గుర్తించి వాటి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని పీవో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, ఎస్ఐ కరక రాము, ఈవోపీఆర్డీ తోట రాములు పాల్గొన్నారు.



కాశీపట్నంలో హోలీ స్పిరిట్ మిషనరీ హాస్టల్ నిర్వాహకులను విచారిస్తున్న పీవో అభిషేక్



గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

వసతి గృహాల తనిఖీ

పాడేరు : మండలంలోని పలు ఆశ్రమ వసతి గృహాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అనకాపల్లి జిల్లాలో ఓ క్రైస్తవ మిషనరీ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు పాడేరు పట్టణంలోని సెయింటాన్స్ క్రిస్టియన్ పాఠశాల, వసతి గృహం, వంట గదులు, విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలను సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణరావు, వైద్యారోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది తనిఖీ చేశారు. విద్యార్థులకు తాజాగా ఉన్న నాణ్యమైన ఆహారం అందించాలని, రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహారం విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో వడ్డించవద్దని, పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేసినా, వారికి నిల్వ పదార్థాలు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పాడేరు: సెయింటాన్స్ పాఠశాల వసతి గృహంలో వంట గదిని తనిఖీ చేస్తున్న సీఐ నవీన్‌కుమార్

కోలుకుంటున్నారు..





కేజీహెచ్‌లో కోలుకుంటున్న చిన్నారులు

- ఆస్పత్రి పాలైన చిన్నారులు క్షేమం
- అధికారులు అప్రమత్తం కావడంతో మరింతమందికి వైద్యసేవలు

మహారాణిపేట (విశాఖ)/కోటవురట్ల/నర్సీపట్నం: కోటవురట్ల మండలం కై లాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఆహారం కలుషితమై అస్వస్థతకు లోనైన చిన్నారులు వివిధ ఆస్పత్రుల్లో క్రమంగా కోలుకుంటున్నారు. పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆశ్రమంలో ఆశ్రయం పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన బాలల్లో ముగ్గురు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్న 35మందికి విశాఖ కేజీహెచ్‌తోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పలు ఆస్పత్రుల్లో సోమవారం చికిత్స అందించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు కలుషిత ఆహారం తిన్న మరింతమంది ఏజెన్సీ బాలలను గుర్తించి మంగళవారం ఆస్పత్రులకు తరలించారు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో 38మంది, విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఇద్దరు, రెయిన్‌బోలో ఒకరు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22మంది, కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురికి వైద్య సేవలు అందిస్తున్నారు.

విశాఖ కేజీహెచ్‌లో..

పాసా ట్రస్టు ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 41 మంది పిల్లలను విశాఖ తీసుకొని వచ్చారు. ఇందులో కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది చికిత్స పొందుతున్నారు. వీరికి కేజీహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు సేవలు అందించారు. ఇందులో అయిదుగురి పరిస్థితి కొద్దిగా విషమంగానే ఉంది. పి.జెస్సికా, పి.మౌనికలను కిమ్స్ ఆస్పత్రికి, ఎస్.రవిని రైయిన్ బో ఆస్పత్రికి తరలించారు.

చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ఆర్డీ

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది గిరిజన విద్యార్థులను, కోటవురట్ల సీహెచ్‌సీలో ఉన్న ఐదుగురిని వైద్య విధాన పరిషత్ రీజనల్ డైరెక్టర్ రామగిద్దయ్య మంగళవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి ఆర్డీకి వివరించారు. పూర్తిగా కోలుకున్నాక మాత్రమే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆర్డీ వైద్యులకు సూచించారు. విద్యార్థులు కోలుకునేందుకు మెరుగైన వైద్యంతోపాటు భోజనం, పండ్లు అందిస్తున్నామని వీరజ్యోతి తెలిపారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి బాలాజీ, ప్రోగాం ఆఫీసర్ ప్రశాంతి, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌వో గోవిందరావు ఉన్నారు. ఏఎస్ఆర్ జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శిరీష ఆస్పత్రిలో ఉండి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు.

పాసా ట్రస్ట్ సీజ్

విషాహారంతో ముగ్గురు విద్యార్థుల మృతికి కారణమైన పాసా ట్రస్ట్‌ను అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు సీజ్ చేశారు. నిర్వాహకుడు, పాస్టర్ కిరణ్‌కుమార్‌పై ఐపీసీ పాత సెక్షన్ 304, భారతీయ న్యాయ సంహిత చట్టం 105 ప్రకారం కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్సను పర్యవేక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద



కోటవురట్ల సీహెచ్‌సీలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఆర్డీ రామగిద్దయ్య

చికిత్స పొందుతున్న బాలల వివరాలు

- విశాఖ కేజీహెచ్‌లో 38మంది
- విశాఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ముగ్గురు
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22మంది
- కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురు

న్యూస్‌రీల్

ఉన్నత విద్యావంతులు కావాలి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలంలో బొండం పంచాయతీ రేగా గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఎంపీ ల్యాండ్ నుంచి రూ.8.5 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పీవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత విద్యవంతులు కావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విషయంలో ఉపాధ్యాయులతోపాటు, తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నందున బడిబయట పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఎంఈవో భారతీరత్నం, సర్పంచ్ భాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కస్తూర్బా పనితీరుపై అసంతృప్తి



విద్యార్థినులతో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బాబు

రంపచోడవరం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అపరిశుభ్రమైన పరిసరాలు, బాలికలకు అందిస్తున్న ఆహార, తదితర విషయాలపై రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థుల చదువు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థినుల నుంచి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వసతులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేకతను తెలిపారు. సమస్యలు ఉంటే లీగల్ సర్వీస్ టోల్ ఫ్రీ నంబరు 15100కు కాల్ చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. వై. శ్రీనివాస్, సంతోష్‌కుమార్, సూపరింటెండెంట్ నాగభూషణ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్

మారేడుమిల్లి : రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మంగళవారం మారేడుమిల్లి మండలంలో పర్యటించారు. దేవరపల్లి బాలురు ఆశ్రమ పాఠశాల, స్థానిక గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో పరిసరాలు, విద్యార్థుల తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ బాలాజీ, హెచ్‌ఎం రామారావు, ఆర్ఐ ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం



దబ్బాపుట్టులో అవగాహన కల్పిస్తున్న ఆనంద్

పాడేరు : ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే జల్‌జీవన్ మిషన్ పథకం లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దుమ్మాపుట్టు గ్రామాన్ని సందర్శించారు. ఆయా చోట్ల తాగునీటి నమూనాలను సేకరించి నీటి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. తాగునీటి వనరులు కలుషితం అయితే ప్రబలే రోగాలపై వారికి అవగాహన కల్పించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాటు డయేరియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, చేతులు శుభ్రం చేసుకునే విధానంపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సాయి రాఘవ, మత్స్యలింగం, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరిక



ఈవో రాజ్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: పర్యాటక కేంద్రమైన అరకులోయలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మంగళవారం ఆయన అరకులోయలోని పెదలబుడు గ్రామ పంచాయతీ, సచివాలయాన్ని సందర్శించారు. అరకులోయ పట్టణంలో అక్రమ నిర్మాణాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ఈవో రాజ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అరకులోయ పట్టణంలో కొంతమంది ప్రజాప్రతినిధులు కాసులకు కక్కుర్తి పడి బినామీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. గిరిజన ప్రాతంలో ఈ వ్యవస్థ పెరిగిపోతుందని, అమాయక గిరిజనులకు డబ్బు ఆశ చూపి లొంగదీసుకొని అక్రమ నిర్మాణాలు జరుపుకుంటున్నారన్నారు. కాసులకు కక్కుర్తిపడి పంచాయతీ పాలకులు పనిచేస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎంపీటీసీలు దురియా ఆనంద్ కుమార్, ఎల్‌బీ భీమరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు నాగరాజు, జగన్ పాల్గొన్నారు.

24న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(ఇన్‌చార్జ్) సత్యనారాయణ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి రెండు, ఐదు స్థాయీ సంఘాలు, 11 గంటల నుంచి నాలుగు, మూడు స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆరు, ఏడు, ఒకటి స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా మలేరియా అధికారి తులసి
- జిల్లా కేంద్రం పాడేరులో అవగాహన ర్యాలీ



విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది

పాడేరు : గిరిజన గ్రామాల్లో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి టి. తులసి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, ఇతర రోగాలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా దోమతెరలను వాడి దోమకాటు నుంచి రక్షణ పొందాలన్నారు. దోమ కాటువల్ల కలిగే అనర్థాలపై జిల్లా వ్యాప్తంగా కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, కరపత్రాలు, గోడపత్రికలు ద్వారా విస్తృతంగా అవగాహన చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి డి. శేషయ్య, సహాయ మలేరియా అధికారులు ఏజే సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

160 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురిపై కేసు నమోదు
- ఇద్దరు అరెస్టు, పరారీలో మిగతా ఇద్దరు
- ఏఎస్పీ ధీరజ్ వెల్లడి



గంజాయి నిందితులతో ఏఎస్పీ ధీరజ్, సీఐ రమేష్

జి.మాడుగుల: ఆటోలో తరలిస్తున్న రూ.6 లక్షల విలువైన 160 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. మైదాన ప్రాంతాలకు ఆటోలో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఉరుము జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆటోలో 80 ప్యాకెట్లలో ఉన్న 160 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్ని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.

తరలింపులో నలుగురి ప్రమేయం

గంజాయి తరలింపులో నలుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు తమ విచారణలో తేలిందని ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. చింతపల్లి మండలం బలపం పంచాయతీ గుంజువీధి గ్రామానికి చెందిన కొర్రా మోహన్‌రావు, చింతపల్లి మండలం, కొత్తపాలెం పంచాయతీ కడసిల్ప గ్రామానికి చెందిన కొర్రా సన్యాసిరావు వద్ద తమిళనాడుకు చెందిన రాజేష్ అనే వ్యక్తి 160కిలోల గంజాయిని రూ.6 లక్షలకు కొనుగోలు చేశాడని చెప్పారు. ఈ మేరకు మోహన్‌రావు,సన్యాసిరావులకు రూ.1.50 లక్షలు అడ్వాన్సుగా చెల్లించాడన్నారు. గంజాయిని చెప్పిన చోటకు చేర్చితే మిగతా సొమ్ము చెల్లిస్తామని రాజేష్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆయన వివరించారు. తరలిస్తున్న 160 కిలోల గంజాయిని ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చింతందూలి గ్రామానికి చెందిన కొర్రా రమణ వద్ద కొనుగోలు చేసినట్టు నిందితులు మోహన్‌రావు, సన్యాసిరావు తెలిపారన్నారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేయగా ఇద్దరు పరారీలో ఉన్నారని ఏఎస్పీ చెప్పారు. పట్టుబడిన ఇద్దరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, గంజాయి, ఆటో స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షోకాజ్ నోటీసుల జారీపై గరంగరం

- అమానవీయ ఘటనపై నిరసనలో పాల్గొన్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు
- అనుమతి లేకుండా నిరసన కార్యక్రమానికి వెళ్లారంటూ అభియోగం
- సంజాయిషీ ఇచ్చేందుకు పాడేరు ఐటీడీఏకు వచ్చిన ఎంఎల్‌హెచ్‌పీలు
- తీసుకోని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా




పాడేరు ఐటీడీఏకు చేరుకున్న ఎంఎల్‌హెచ్‌పీలు, సంజాయిషీ పత్రం రాస్తున్న మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్

సాక్షి, పాడేరు: అనుమతి లేకుండా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గరంగరంగా ఉన్నారు. కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై అమానవీయ ఘటనను నిరసిస్తూ వైద్యబృందాలకు సంఘీభావం తెలిపి వారు నిరసనలో పాల్గొనడం తెలిసిందే. ఈ నెల 17వ తేదీన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుల పిలుపు మేరకు జిల్లాలోని 32 మంది ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు) పాల్గొన్నారు. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమానికి వెళ్లారంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి వారికి సోమవారం షోకాజ్ నోటీసులు అందాయి. వీరిలో ఒకరు మెటర్నిటీ లీవ్‌లో ఉన్నప్పటికీ ఆమెకు కూడా నోటీసు జారీ అయింది. ఎంఎల్‌హెచ్‌పీలో అధికశాతం మహిళలే ఉన్నారు. తోటి మహిళా వైద్యురాలికి జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమంలో పాల్గొంటే తమకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమంటూ వారు వాపోతున్నారు. వీరంతా సంజాయిషీ పత్రాలతో మంగళవారం సాయంత్రం పాడేరు ఐటీడీఏకు చేరుకున్నారు. వైద్యులు, పలు సంఘాల ప్రతినిధులతో కలిసి డీఎంహెచ్‌వో జమాల్‌బాషాను కలిశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి గల పరిస్థితులను వారు సమగ్రంగా వివరించారు. అయితే వారి నుంచి సంజాయిషీ పత్రాలను డీఎంహెచ్‌వో తీసుకోలేదు. దీంతో వారంతా వెనుదిరిగారు.

వెనక్కి తీసుకోకుంటే ఆందోళన

జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనపై చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాలోని 33 మంది ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లకు షోకాజ్ నోటీసుల జారీ దుర్మార్గమని, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనంగి చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలో పాల్గొన్న వారికి డీఎంహెచ్‌వో నోటీసులు ఇచ్చారన్నారు. వెంటనే వాటిని వెనక్కి తీసుకోకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రశ్నించడం, నిరసన తెలిపే హక్కు ఉంటుందని ఇటీవల ప్రకటించిన మంత్రి నారా లోకేష్ ఎంఎల్‌హెచ్‌పీలకు నోటీసులు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఇచ్చిన నోటీసులను ప్రభుత్వం వెనక్కి తీసుకోని పక్షంలో ఉద్యోగ, మహిళా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో శిరీష

రంపచోడవరం: దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. మండలంలోని ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎం.చంటిబాబు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా

- 9 మందికి గాయాలు



గాయపడిన చిట్టిబాబు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ ఎస్. కొత్తూరు నుంచి వారపుసంతకు ప్రయాణికులతో వస్తున్న ఆటో మంగళవారం ఘాట్ రోడ్డులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్. కొత్తూరులో ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకొని జి.మాడుగుల సంతబయలు గ్రామంలో వారపుసంతకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన కిల్లో చిట్టిబాబుకు తీవ్ర గాయాలవడంతో పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలైన ఏడాది వయసు గల పాపతోపాటు కిలో రాజు, తలాబు నూకలమ్మ, చినబాలయ్య, తల్లాబు రూపవతి, పూజారి పద్మ, ఎస్. కొండబాబు, టి. యశ్వంత్‌లను స్థానిక పీహెచ్‌సీకి ప్రైవేటు వాహనంలో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సర్పంచ్ ఐసరం హనుమంతరావు పరామర్శించారు.

అనధికార వసతి గృహాలపై చర్యలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఐడీడీఏ పీవో అభిషేక్

మహారాణిపేట(విశాఖ): గిరిజన ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాలపై చర్యలు తీసుకుంటామని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని పాసా ట్రస్ట్ ఆశ్రమంలో కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కలుషిత ఆహారం తిన్న విద్యార్థులందరినీ గుర్తించి ఆస్పత్రులకు తరలించినట్టు చెప్పారు. ఏజెన్సీలో నిర్వహిస్తున్న ప్రైవేటు వసతి గృహాలను రిజిస్టర్ చేశారో లేదో పరిశీలించి, అనధికార వసతి గృహాల మూసివేతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వసతి గృహాలను తనిఖీ చేయడానికి విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులతో కమిటీ వేసినట్టు తెలిపారు. చింతపల్లి మండలంలో ఒక ప్రైవేటు వసతి గృహాన్ని మూసివేసినట్టు ఆయన చెప్పారు. అనంతగిరి మండలం కాశీపట్నంలో అనధికార వసతి గృహాన్ని గుర్తించి, అక్కడున్న చిన్నారులను ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలకు తరలిస్తున్నామన్నారు. కైలాసపట్నంలో అస్వస్థతకు గురైన చిన్నారుల్లో కొంతమందిని ప్రైవేటు ఆస్పత్రిలోను, 38 మందిని కేజీహెచ్‌లోను చేర్పించి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. పాడేరు జనరల్ ఆస్పత్రిలో ఎనిమిది మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అందరూ కోలుకున్నాక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక ప్రైవేట్ వసతి గృహాలకు పంపిస్తున్నారన్నారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, ఎస్‌డీసీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి



కేజీహెచ్‌లో పిల్లలతో మాట్లాడుతున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి

మహారాణిపేట: కైలాసపట్నంలోని అనధికార పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ఆశ్రమంలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి మంగళవారం పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి వర్గాలకు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం పాడేరు ఐటీడీఏ పీవో, అల్లూరి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ దుర్ఘటనకు సంబంధించి కాల్ సెంటర్ ఏర్పాటు చేసి పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలన్నారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులకు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఆస్పత్రుల్లో వైద్యం అందించే చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి విద్య అభ్యసించే అవకాశం కల్పించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

పలువురి పరామర్శ

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి బాలరాజు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ మూల వెంకటరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యులు లక్ష్మి, ఎం.రజని, సూర్యనారాయణ, విజయలక్ష్మి, సీడీపీవో శ్రీలత, జిల్లా బాలల సంరక్షణాధికారి లక్ష్మి, పీవో ఐసీ రమేష్, కేజీహెచ్ వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులు పరామర్శించారు.

4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు సిద్ధం

90 శాతం సబ్సిడీతో పంపిణీ



డుంబ్రిగుడ ఆర్బీకేకు తరలిస్తున్న రాజ్‌మా విత్తనాలు

సాక్షి,పాడేరు: గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను అధికారులు సిద్ధం చేశారు. మంచి లాభాల పంటగా గుర్తింపు పొందిన పాడేరు డివిజన్‌లో మాత్రమే సాగయ్యే రాజ్‌మా చిక్కుళ్ల పంట ప్రతి ఏడాది సంక్రాంతి సమయంలో చేతికి అందుతుంది. పాడేరు డివిజన్‌లో 10వేల ఎకరాల విస్తీర్ణంలో గిరిజన రైతులు ప్రతి ఏడాది రాజ్‌మాను సాగుచేస్తున్నారు. ఎకరానికి 20 కిలోల విత్తనాలు అవసరమవడంతో అందుకు తగ్గట్టుగానే విత్తనాలను వ్యవసాయశాఖ సమకూర్చింది. రాజ్‌మా విత్తన ధర కిలో రూ.151 కాగా, 90శాతం సబ్సిడీతో పంపిణీ చేసేందుకు 4,500 క్వింటాళ్లను వ్యవసాయశాఖ ప్రధాన ఆర్‌బీకేలలో సిద్ధం చేసింది.రైతుల సాగు లెక్కల ఆధారంగా విత్తనాల పంపిణీని మంగళవారం నుంచి ప్రారంభించింది. అనంతగిరి మండలానికి 213 క్వింటాళ్లు, అరకులోయకు 400 క్వింటాళ్లు, చింతపల్లికి 610, డుంబ్రిగుడకు 323, జీకే వీధికి 773, హుకుంపేటకు 276, ముంచంగిపుట్టుకు 296, పాడేరుకు 348, జి.మాడుగులకు 560, పెదబయలుకు 500, కొయ్యూరు మండలానికి 90 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు.

పారదర్శకంగా పంపిణీ

ఈఏడాది కూడా 90శాతం సబ్సిడీతో ముందస్తుగానే రాజ్‌మా విత్తనాలను అందుబాటులోకి తెచ్చినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు తెలిపారు. విత్తనాల పంపిణీని పారదర్శకంగా చేపడుతున్నామని ఆయన చెప్పారు. రాజ్‌మా సాగు చేసిన రైతులు,వారి భూముల వివరాలు పరిగణనలోకి తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను పంపిణీని చేపట్టామని, విత్తన శుద్ధిపైన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లి: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె స్థానిక బాలనందనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మెనూ, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన ఆహారం, తాగునీరు అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



బాలికలతో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

గంగవరం : ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలించారు. బాలికలతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు పొందాలని సూచించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాల ప్రణాళిక ప్రకారం బోధన జరగాలని సూచించారు. వసతి గృహంలో ఎవరైనా విద్యార్థులు అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకువెళ్లి సత్వర వైద్యం అందించాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ హెచ్. శ్రీనివాసరావు, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో-2 టి.మల్లేశ్వరావు, పీడీపీవో లక్ష్మి , అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి కృష్ణమోహన్, పాఠశాల హెచ్ఎం నాగమణి పాల్గొన్నారు.

గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



సమీక్షలో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: గిరిజన రైతులను ఆర్థికంగా ఆభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసి, సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశపు హాలులో మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో పీవో మాట్లాడుతూ ఈ-క్రాప్, పంటల బీమా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.గిరిజన రైతులకు 90శాతం సబ్సిడీపై వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు సరఫరా చేసినట్టు తెలిపారు. పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులు, ఏజెన్సీలో వరి, పత్తి పంటల సాగు విస్తీర్ణంపై అధికారులతో చర్చించారు. వ్యాధులు రాకుండా నూరుశాతం పశువులకు టీకాలు వేయాలని, గోకులం షెడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జీడిమామిడి, పండ్ల మొక్కల సరఫరా వివరాలు తెలుసుకున్నారు. పొలాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుపై ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ షరీఫ్, ఏడీఏ సీహెచ్.కె.వి చౌదరి, సావిత్రి, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



ఆందోళన చేస్తున్న బాధిత మహిళా కుటుంబ సభ్యులు



సత్యభారతి(ఫైల్)

చింతపల్లి: మనస్తాపంతో వివాహిత కర్రి సత్యభారతి(28) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చింతపల్లిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం ... స్థానిక నెయ్యిలవీధికి చెందిన కర్రి మణికంఠతో మైదాన ప్రాంతం కొంగసింగి గ్రామానికి చెందిన సత్యభారతితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి నాలుగు, ఆరేళ్ల వయసు కలిగిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సోమవారం రాఖీ పండగ సందర్భంగా సత్యభారతి తన సోదరునికి రాఖీ కట్టేందుకని పుట్టినిల్లు కొంగసింగి గ్రామానికి వెళ్లింది. తిరిగి రావడం ఆలస్యమవడంతో ఇంటికి వచ్చిన భార్యను భర్త గట్టిగా నిలదీశాడు. శారీరంగా హింసించడంతో మనస్తాపానికి గురైన సత్యభారతి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, బంధువులు చింతపల్లి చేరుకుని ఆందోళన చేపట్టారు. తమ బిడ్డను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పెదబయలు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోచన్ బేర సూచించారు. మంగళవారం మండలంలోని కొత్త రూడకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలో రూడకోట పోలీసు ఔట్ పోస్టు ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆశ్రమ పాఠశాల,రూడకోట పీహెచ్‌సీ, బస్టాండ్, అంబేడ్కర్ పార్కు, వారపు సంత ఆవరణలో సుమారు రెండువేల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడు కోవడం అందరి బాధ్యత అని, ,ప్రతి ఒక్కరు ఇంటి, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ప్రకృతిని ప్రేమించాలని అన్నారు. మంచి వాతావరణంగా మార్చుకోవడం మన చేతుల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ దేవ్ సింగ్, పాఠశాల హెచ్ఎం దేముడు, పోలీసులు సిబ్బంది ఎస్కే అల్లా తదితరులు పాల్గొన్నారు.

బదిలీల జీవోపై ఉద్యోగుల అసంతృప్తి

- గత ప్రభుత్వంలో 20 శాతం సీలింగ్‌తో బదిలీలు
- ప్రస్తుతం అందరినీ బదిలీ చేసే అవకాశం



మహారాణిపేట(విశాఖ):బదిలీలజీవోపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. నగరంలో పనిచేసే వారందరినీ అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు బదిలీ చేసే అవకాశం ఉండడంతో వారంతా రగిలిపోతున్నారు. గత ప్రభుత్వంలో 20 శాతం సీలింగ్‌తో ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారి బదిలీలకు అనుమతి ఇచ్చారు. కానీ ప్రస్తుతం సీలింగ్ లేకపోవడంతో అందరినీ ఇక్కడి నుంచి బదిలీ చేసే అవకాశం ఉంటుందని ఉద్యోగులు అంటున్నారు. కొత్త జీవో ప్రకారం 14 శాఖల ఉన్నతాధికారులు ఐదేళ్లు ఒకే చోట పనిచేస్తున్న వారి జాబితాను సిద్ధం చేశారు. వారికి తప్పనిసరిగా ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేయనున్నారు. శతశాతం బదిలీలకు అవకాశం ఉండడంతో బదిలీల జాబితా చాంతాడంత ఉన్నట్టు తెలిసింది. కాగా.. ఈ ప్రక్రియలో సీలింగ్ ఎత్తేయడంతో ఉద్యోగులు కినుక వహిస్తున్నారు.

సీలింగ్ లేకపోవడం ఇబ్బందే..

బదిలీల ప్రక్రియలో సీలింగ్ ఎత్తేయడం వెనుక కూటమి ప్రభుత్వం కుటిల బుద్ధి బయటపడుతోంది. గత ప్రభుత్వంలో నగరంలో పనిచేసిన వారంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశారన్న గట్టి అభిప్రాయంతో కూటమి ప్రజాప్రతినిధులు ఉన్నారు. సీలింగ్ విధానంలో అయితే అందరినీ ఇక్కడి నుంచి పంపించే అవకాశం ఉండదు. సీలింగ్ ఎత్తేయడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరినీ బదిలీ చేసే అవకాశం ఏర్పడింది. కొంత మందిని ఐదేళ్ల ప్రాతిపాదికన చూపించి మిగిలిన వారిని సాధారణంగానే స్థానచలనం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జాబితాలు సిద్ధం

బదిలీల ప్రక్రియకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశముంది. ఈలోగా అన్ని శాఖల్లో బదిలీలు చేపట్టాల్సి ఉంది. సాధారణంగా ఎన్నికల తర్వాత ఈ బదిలీల ప్రక్రియ జూన్‌లోనే పూర్తయ్యేది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆగస్టు వరకు ఈ విషయంపై దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలు ఉన్న వారి జాబితాను ఇప్పటికే స్థానిక నేతల నుంచి ప్రభుత్వ పెద్దలు రప్పించుకున్నారు. అలాగే ఇప్పటికే కొంత మంది ఉద్యోగులు జిల్లాలో ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వారు సూచించిన వారికే పోస్టింగ్‌లు లభించే అవకాశాలు ఉన్నట్టు బహిరంగంగానే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే 14 ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు బదిలీల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే కొంత మంది ప్రజాప్రతినిధులు తమకు కావాల్సిన వారి పేర్లను ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ప్రభుత్వ పెద్దల నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే త్వరలోనే అన్ని శాఖల్లోనే జాబితాను ప్రకటించే అవకాశముంది.

డేంజరస్.. బ్రూసెల్లోసిస్!

బ్రూసెల్లోసిస్ అనేది పశు సంపదను నిర్వీర్యం చేసే ప్రమాదకరమైన వ్యాధి. ఇది బ్రూసిల్లా అబార్టస్ బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ సూక్ష్మ జీవులు పశువుల జననేంద్రియాలు, పొదుగును ఆశించి వ్యాధిగ్రస్తం చేస్తాయి. ఈ వ్యాధి సోకితే పశువులు మరణిస్తాయి. మనుషులకు అంటుకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు 4 నెలల నుంచి 8 నెలల వయసు దూడలకు మంగళవారం నుంచి టీకాలు వేయడం ప్రారంభించారు.

- ఆవుదూడల్లో ఎక్కువగా ప్రబలుతున్న వ్యాధి
- నిర్లక్ష్యం చేస్తే పశువుల మృత్యువాత
- ఒకదాని నుంచి మరొక పశువుకు వ్యాప్తి..
- 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకా తప్పనిసరి
- వచ్చే నెల 18వ తేదీ వరకు వ్యాధి నిరోధక టీకాలు





ఆవు దూడలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: మనుషుల్లో ఎలా అయితే సీజనల్ జ్వరాలు, అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయో.. అదే విధంగా పాడి పశువుల్లోనూ వర్షాకాలంలో ఎక్కువగా ప్రబలుతూ ఉంటున్నాయి. ఈ సీజన్‌లో పశువుల్లో ఎక్కువగా బ్రూసెల్లోసిస్ వ్యాప్తి చెందుతోంది. ఆవుదూడల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది ఒక పశువుకు వస్తే..దాని నుంచి మరొక పశువుకు గాలి ద్వారా వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి తీవ్రతరమై పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఈ వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి టీకాలు వేయిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ టీకా కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకూ చేపడుతోంది. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా పశువైద్యాధికారులు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవే..

దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పికోర్నా విరడే కుటుంబానికి చెందిన అఫ్తోస్ వైరస్ సోకిన దాదాపు ఒక వారం తర్వాత జ్వరం వస్తుంది. ఈ జ్వరం 103-106 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పెరుగుతోంది. పశువుల నోట్లో, చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం, మేత, నీళ్లు తీసుకోలేక నీరసించిపోతాయి. నోరు, గిట్టల మధ్యలో బొబ్బలు ఏర్పడడం, 2-3 వారాల్లో అవి చితికి పుండ్లుగా మారతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయక పోవడం, చూడి నిలబడకపోవడం, మగ పశువులలో వృషణాల వాపులు, కీళ్ల వాపు, వంధ్యత్వం రావడం వంటివి వ్యాధి లక్షణాలు. వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఈ వ్యాధి ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుతుంది. నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు గల ఆడపెయ్యలకు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి. పాలను బాగా మరిగించి మాత్రమే పాడి రైతులు వినియోగించుకోవాలి.

అనకాపల్లి జిల్లాలో పశువుల వివరాలు ఇలా..

- జిల్లాలో మొత్తం 7.20 లక్షల వరకూ పశువులు
- వీటిలో 5.20 లక్షల గేదెలు, 1.40 లక్షల ఆవులు, 60 వేల వరకూ ఆవుదూడ, గేదె పెయ్యిలు
- జిల్లాలో బ్రూసెల్లోసిస్ టీకాలకు 1.85 లక్షల పశువులు గుర్తింపు

ప్రతి పాడిరైతు సద్వినియోగం చేసుకోవాలి..



జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాల కార్యక్రమం 29 రోజుల పాటు నిర్వహిస్తున్నాం. ఈ టీకాలు నాలుగు నెలలు దాటిన దూడ నుంచి ప్రతీ పశువుకు ముందస్తుగా వేయించాలి. కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గముఖం, చొంగ వంటి లక్షణాలుంటే వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులను వెంటనే మంద నుంచి వేరు చేసి ఉంచాలి. వీటి పాలు దూడలకు తాగించకూడదు. పశువుల పాకను క్రిమిసంహార మందులతో, వాషింగ్ సోడాతో కడగాలి. ఈ వ్యాధితో చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి.

– డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి